కథ

# గండం

**బుట్ట భుజాన్నేసుకుని ఈతపళ్ళకోసం కొండవాలులోకి దిగుతుంటే గుండె దడదడ లాడింది మల్లికి. తను అడుగు పెడుతున్న ప్రదేశం ఎంత ప్రమాదకరమైందో ఆమెకి తెలుసు. అన్నీ తెలిసినా పొట్టకూటి కోసం తప్పని పరిస్థితి. అందుకే..నాలుగు డబ్బులకి ఆశించి మరీ ముందుకి సాగుతోంది. అలా నడుస్తున్నదల్లా ఒక్కక్షణం ఆగి చుట్టూ చూసింది, ఎందుకైనా మంచిదని!**

సరిగ్గా అప్పుడే ఎక్కడో ఎండుపుల్ల విరిగిన చప్పుడైంది. గిర్రున వెనక్కి తిరిగి చూసింది. అక్కడ..చెట్టుమీద కాకి! గూడు కట్టుకోవడం కోసం కాబోలు, కొమ్ముకున్న పుల్లని విరిచి ముక్కున కరుచుకుంటోంది. ఆ దృశ్యం చూసి..హాయిగా నిట్టూర్చి, ముందుకి కదిలింది. అలా నాలుగ్గజాలు నడిచిందో లేదో, అంతలోనే ఏదో అనుమానం పొడసూపింది. ఆగి, చెవులు నిక్కించింది.

లీలగా వినిపించింది. వెనుక ఏదో బ..రు..వై..న.. శరీరం- తన 'భారీ'కాయాన్ని సంభాళించుకుంటూ... ఆ శబ్దాన్ని ఇంకెవ్వరికీ తెలియనివ్వకుండా..అడుగుల్ని ఎత్తి ఎత్తి వేస్తున్న సవ్వడి.

మల్లి గుండె ఝల్లుమంది. వెనుక నున్నది పులో, ఎలుగో అర్థం కాలేదు. కానీ, ఆ కాస్త ఆలోచనకే ఆమెకి స్పృహ తప్పినంత పనైంది. ఇంతలో ఆకులు గలగలమన్నాయి. వెనకున్న జంతువేదో ఎ..గి..రి..తన మీదకి దూకబోతుందన్న విషయం ఆమెకి స్పష్టమైంది. చావు ధైర్యంతో వెనక్కి తిరిగిన ఆమెకి, తన మీదకి పంజా విసురుతున్న పెద్దపులి కనిపించింది. అంతే! పిచ్చిగా అరుస్తూ వెల్లకిలా పడిపోయింది. మరుక్షణం..ఆమెమీద పెద్దపులి పడింది. దాని కోరలు ఆమె కంఠంలో దిగబడిపోయాయి.

మరోసారి కెవ్వున అరిచింది మల్లి. అలా అరుస్తున్నప్పుడే..''కొక్కొరోకో'' అంటూ ఆమె చెవిన పడింది కోడికూత! మల్లి భృకుటి ముడిపడింది. పులివాత పడి చచ్చిపోయిన తనకి కోడికూత వినపడడమేమిటీ? అనిపించింది. అప్పుడు..మెల్లగా కళ్లు తెరిచింది.

ఎదురుగా పులిలేదు. తనున్నది అడవీ కాదు. అచ్చంగా తన గుడిసెలో, తనుండాల్సిన మంచం మీదే ఉంది. పరిసరాలు చూస్తుంటే..అప్పుడు తెలిసొచ్చింది మల్లికి. ఇంతవరకూ తనకొచ్చింది కలని! నిజం గ్రహించి హాయిగా నిట్టూర్చబోయేంతలో..మళ్ళీ కోడి కూసింది. అది తొలికోడి.

ముచ్చెమటలు పట్టేశాయి మల్లికి. దిగ్గున లేచి కూర్చుంది. 'అంటే? తనకొచ్చింది తెల్లవారుఝాము కల. ఆ సమయంలో వచ్చిన కలలు నిజమౌతాయంటారు పెద్దలు. అయితే..ఈ లెక్కన తను పులివాత బడడం ఖాయమా?' అనుకుంటూంటే ఆమెకి నవనాడులూ కృంగిపోయాయి.

భయం వేసింది.

ఎలాగో తనని తాను సంభాళించుకుని లేచి గ్లాసుడు మంచినీళ్ళు తాగి మళ్ళీ నిద్రకి ఉపక్రమించింది. అలా పడుకుని లేస్తే కల తాలూకు దుష్ప్రభావం తగ్గిపోతుందన్నది ఆమెకి తెలిసిన విషయం! కానీ, ఎంత ప్రయత్నించినా మల్లి కోరిక నెరవేరలేదు.

చూస్తుండగానే తెల్లవారిపోయింది. తూర్పున వెలుగు రావడమే ఆలస్యం..గబగబా పనులన్నీ ముగించుకుని కొండమీదున్న సత్తెమ్మ తల్లిగుడి వైపు దారి తీసింది.

★ ★ ★

మల్లి చేతి రేఖల్ని పరిశీలిస్తున్న పూజారి భృకుటి ముడిపడింది.

''ఏంటి అయ్యోర్రూ? ఏం జరగబోతోంది?'' మారుతున్న ఆయన ముఖ కవళికల్ని గమనించి ఆందోళనగా అడిగింది మల్లి.

''నీకు గండం ఉంది. త్వరలోనే...ఆర్నెలల పాటు జాగ్రత్తగా ఉండాలి'' చెప్పాడాయన.

అదిరిపోయిందామె. ''పెద్ద గండవా సామీ!'' అక్షరమక్షరం కూడబలుక్కుంటూ అడిగింది.

''అలాగే కనపడుతోంది''

''తప్పించుకునేందుకు పూజలేవైనా ఉంటే..''

''...ఉంటే నేనే చెప్పేవాణ్ణి. అయినా..ఎన్ని పరిహారాలు చేసినా ప్రయోజనం ఉంటుందని నేననుకోను. నీకీ గండం తప్పదు. జాగ్రత్తగా ఉండు'' హెచ్చరించాడాయన.

గుండె జారిపోయింది మల్లికి. ఇక చేసేదేం లేకపోవడంతో కొండ దిగి కాళ్ళీడ్చుకుంటూ ఇంటిదారి పట్టింది. గూడేనికి వెడుతుంటే దార్లోనే ఆమెకి ఎదురయ్యాడు నాగులు. అతనూ గూడెపు మనిషే కానీ నెలకి పాతిక రోజులు పట్నంలోనే ఉంటాడు. వెడుతూ వెడుతూ తనతోపాటు గూడెంలోంచి ఎవరో ఒకర్ని వెంట బెట్టుకుని పట్నం తీసుకెళ్ళి వాళ్ళకి ఆ పనీ ఈ పనీ ఇప్పిస్తుంటాడు. ఈసారి ఎవర్ని తీసుకెళ్ళాలా అని ఆలోచిస్తున్న అతనికి మల్లి కనపడింది.

''ఏంటే అలాగున్నావ్? ఏట్వైంది?'' దిగాలుగా ఉన్న మల్లిని చూస్తూ ఆరా తీశాడతను.

''ఎలా ఉన్నాను?'' ఎదురు ప్రశ్న వేసిందామె.

''ఏదో పోయినట్టు..'' అన్నాడు.

ఆ మాత్రం పరామర్శకే కదిలిపోయిందామె. ఇక తట్టుకోలేనట్టుగా మోకాళ్ళమీద కూలబడిపోయి మొహాన్ని చేతుల్లో దాచుకుని భోరుమంది.

ఆమె ఏఢుపు చూసి బిత్తరపోయాడతను. ఆ భావంలోంచి తేరుకుని తనూ ఆమె పక్కనే చతికిలబడ్డాడు. ''ఊరుకో..ఏడవకు..ఏడవకు'' మల్లి భుజం తడుతూ ఓదార్చాడు.

అతని అనునయాల్తో ఐదు నిమిషాలకే తన బాధలోంచి బయపడిందామె.

''ఇప్పుడు సెప్పు. ఏంటిసయం?'' మెల్లిగా అడిగాడతను.

''పులెత్తుకుపోయినట్టు కలొచ్చింది నాకు'' ముక్కు ఎగబీలుస్తూ అందామె.

అది విని పగలబడి నవ్వాడతను.

''కలొచ్చినందుకు భయపడ్డావా..? రేత్రి కలలు నిజమౌతాయేంటే వెర్రిమొగమా!'' నవ్వేస్తూ అన్నాడు.

కానీ ఆమె నవ్వలేదు. ''అది తెల్లారగట్టేవొచ్చిన కల'' అంది.

వింటున్న అతని ముఖంలో నవ్వు మాయమైంది. ''మరైతే కొండమీదున్న అయ్యోర్రి దగ్గరికి ఎల్లేకపోయేవా?'' అడిగాడు.

''ఇప్పుడు అక్కణ్ణుంచే వచ్చేది. నాకు..ఏదో గండం వుందంట'' చెప్పింది.

గాఢంగా నిట్టూర్చాడు నాగులు. ''మరి ఏం చేద్దామనుకుంటున్నావ్?'' అడిగాడు పావుగంట తరువాత.


''అదే నాకూ తెలవట్లేదు'' నిస్పృహాయంగా అంది.

''ఓ పనిసేయ్. నాతో పట్నమొచ్చేయ్''

''ఒత్తే..గడం తప్పిపోద్దా'' బేలగా అడిగిందామె.

''అనే నా ఆశ. ఎంచేతంటే పులులూ ఎలుగొడ్లూ ఉంటే గింటే ఇక్కడుంటాయే తప్ప,

**ఎ.కె.వి. రత్నమాల**



పట్నంలో ఉండవు కదా!'' అన్నాడు.

అదీ నిజమేననిపించింది మల్లికి. అంతే, ఆ మరు క్షణమే నాగులుతో కలిసి పట్నానికి వెళ్ళిపోవాలన్న నిర్ణయానికి వచ్చేసింది మల్లి.

★ ★ ★

ఎదురుగా నిలుచున్న మల్లిని ఎగాదిగా చూశాడతను. ఆ కళ్ళలో అదో రకం ఆకలి. చూస్తున్న ఆమెకి ఇబ్బంది కలిగింది. ఒక్కక్షణం..పని మానేసి వెనక్కి తిరిగి వెళ్ళిపోదామనుకుంది. అంతలోనే గండం గుర్తొచ్చింది. తనని తాను అదుపు చేసుకుంది.

''ఈయనే..మనకి పనిప్పించే కాంట్రాక్టరు సారు'' అతన్ని చూపిస్తూ మల్లితో చెప్పాడు నాగులు.

బదులుగా చేతులు జోడించిందామె. అలా చెయ్యమని నాగులే చెప్పాడు.

''పేరేమిటి?'' అడిగాడు కాంట్రాక్టర్, పెదాల్ని నాలుకతో తడుపుకుంటూ!

''మల్లి!'' చెప్పింది.

''బావుంది'' ఆబగా అన్నాడు.

బావున్నది తనో, తన పేరో అర్థం కాలేదామెకి. సందేహం కలిగినా బయటపెట్టలేదు. అది భయం కాదు. ఇక్కడ తనుండేది కేవలం ఆరు నెలలు. అదీ 'గండం' గడవడం కోసం. ఈ అర్థ సంవత్సరంలో ఎవరెలా ఏడ్చినా తనకి అనవసరం..అన్న అభిప్రాయం!

''రేటెంత?'' మళ్ళీ అతనే అడిగాడు.

కాంట్రాక్టర్ అన్నదేమిటో ఆమెకి అంతుపట్టలేదు. అతను అడిగిన దానికి ఏమని జవాబు చెప్పాలో తెలియక నాగులు వైపు చూసింది.

''మీరెంతంటే అంత!'' మల్లికి బదులుగా చెప్పి, అదోలా నవ్వాడతను.

కాంట్రాక్టర్ కూడా నవ్వాడు. తర్వాత జేబులోంచి ఐదొందల నోటొకటి తీసి నాగులు ముందున్న బల్లమీద పడేశాడు. ''పిల్ల జాగ్రత్త! కొత్తకదా! ప్రత్యేకంగా ఓ గుడిశె వేయించు. ఏ లోటూ రాకుండా చూసుకో!'' చెప్పాడు. అన్నిటికీ తలూపి మల్లితో కలిసి ఇవతల కొచ్చేశాడతను.

''అసలు..ఆ సారు పిచ్చోడా? ఎర్రోడా? అలాగున్నాడు'' బయటికి రాగానే నాగుల్ని కోపంగా నిలదీసింది మల్లి.

''రెండూ కాదు. శానా మంచోడు. తనకాడ కూలిపని సేసేటోల్లని సొంతమడుసుల్లా సాకుతాడు. అందుకే కదా! నీకోసం ఐదొందలిచ్చాడు'' నవ్వుతూ అన్నాడు నాగులు.

మల్లికి నమ్మబుద్ధి కాలేదు. అయినా అతని మాటలకి ఎదురు చెప్పలేదు. కారణం ఒకటే...తనిక్కడుండేది ఆర్నెల్లు. ఈమాత్రం భాగ్యానికి ఈ గొడవలన్నీ తనకి అనవసరం! అన్న ఆలోచనే. అందుకే ఎవరి గురించీ ఎక్కువగా పట్టించుకోకుండా తన పని తాను చూసుకోవడం అలవాటు చేసుకుంది.

చేస్తున్న కూలి పనితో ఏ రోజు కారోజుగా చేతిలో పడుతున్న డబ్బుతో మల్లికి రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయి. సరిగ్గా అప్పుడు జరిగిందా సంఘటన.

ఆరోజు రాత్రి..ఎంత ప్రయత్నించినా మల్లికి నిద్రపట్టలేదు. కళ్ళు మూసినా..కళ్ళు తెరిచినా..అనుక్షణం, మూడు నెలల క్రితం ఇచ్చిన 'పులి' కలే గుర్తు రావడం ప్రారంభించింది. ఎందుకో భయం వేసింది. దానికి తోడు ఒంటరితనం! అందరు కూలీలకీ నిర్మాణంలో ఉన్న ఆ బిల్డింగ్ సెల్లార్‌లో, తడికలతో కట్టిన గదులు కేటాయిస్తే, తనకి మాత్రం 'ప్రత్యేకంగా!' అందరికీ కొంచెం దూరంగా గుడిశె ఉండడమే అందుకు కారణం.

గుడిశె ముందు ఎవరో కదిలి నట్టయింది. బయటికి వచ్చి చూస్తే..కాంట్రాక్టర్ కనిపించాడు. ఆ సమయంలో అక్కడ అతన్ని చూసి అవాక్కయిపోయింది మల్లి.

''ఏం సారూ! ఇటొచ్చినవ్?'' అడిగింది ధైర్యం చేసి.

''నీ కోసమే!'' ఠక్కున అన్నాడతను.

''ఎందుకూ?'' అయోమయంగా ఆరాతీసింది.

జవాబుగా ఆమె భుజాల చుట్టూ చేతులేసి చప్పున దగ్గరకి లాక్కుని ఠక్కున వాటేసుకున్నాడు.

బిత్తరపోయిందామె. ఆ భావంలోంచి తేరుకుని ఏదో అభ్యంతరం చెప్పబోయేంతలో..మళ్ళీ అతనే అన్నాడు. ''నువ్వంటే నాకిష్టం'' అని! చెబుతూనే మల్లి చెయ్యి పట్టుకుని గుడిశెలోకి లాక్కుపోయాడు.

ఏం జరగబోతోందో అర్థమైందామెకి.

అందుకే..బతిమాలింది. బామాలింది. ఆ పని చెయ్యొద్దని కాంట్రాక్టర్ కాళ్ళమీద పడింది.

విన్లేదతను. బలవంతంగా ఆమె మీద పడి తన కోరిక తీర్చుకున్నాడు. ఆ తర్వాత..పొగిలి పొగిలి ఏడుస్తున్న ఆమెనలాగే ఒదిలేసి బయటకి వెళ్ళిపోయాడు.

★ ★ ★

''పెమాదమంటే పేణం పోటమేకాదు..మానం మంట గలిసిపోటం కూడాను. అసలు గండమంటే పులిలాగో, పుట్రలాగో ఉంటదనుకున్నాను. కానీ అది ఆరడుగుల మొగోడి రూపంలో కూడా వచ్చిపడచ్చని రేత్రే తెల్సుకున్నాను'' కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ అంది మల్లి.

''ఇప్పుడేమైందే?'' అడిగాడు నాగులు.

''ఆ సారు..నా కన్నాయం సేసేడు'' చెప్పింది ముక్కు ఎగబీలుస్తూ.

''ఊరుకోవే ఎర్రి మొగవా! ఆ బాబు శానా మంచోడు. జరిగిందానికి ఆయనా బాదడిపోతన్నాడు. 'శానా తప్పు సేసేను' అని కుమిలిపోతన్నాడు'' బాధగా అన్నాడు నాగులు.

వింటున్న మల్లికి ఒళ్ళు మండిపోయింది. ''అయ్యన్నీ సరే! ఇప్పుడు నా గతేటి?'' నిలదీసింది.

''ఏటీ అవలేదు. సారు నిన్ను తన సొంత మడిసిలా సూత్తానన్నాడు. ఇదుగో నా సేత నీకు డబ్బు కూడా పంపేడు'' చెప్పి జేబులోంచి ఐదు వంద నోట్లు తీసి ఆమె చేతిలో కుక్కాడు.

చూస్తున్న మల్లికి కొంతలో కొంత సంతోషంగా అనిపించింది. కాంట్రాక్టర్ డబ్బు పంపినందుక్కాదు. చేసిందంతా చేసేసి ఆనకి మొహం చాటేసి పారిపోకుండా, ధైర్యంగా తనని అతని మనిషిగా ఒప్పుకున్నందుకు. ఆ పైన అతని దృష్టిలో తన స్థానం పదిలమైనందుకు! అందుకే అతనిమీద ఆమెకి అభిమానం ఏర్పడింది. ఎంతంటే, మరోసారి కాంట్రాక్టర్ తన గుడిశెలోనికి వచ్చినా 'కాదు పొమ్మన'కుండా... సాదరంగా ఆహ్వానించేంత!

★ ★ ★

రోజులన్నీ సవ్యంగా సాగిపోతే 'విధి'కి విలువుండదు. కనుకనే మల్లి జీవితం మరో మలుపు తిరిగింది. ఆరోజు..కాంట్రాక్టరికీ ఆమెకీ మధ్యనగల సాన్నిహిత్యం వేవిళ్ళ రూపంలో బయటపడింది. నిజం తెలిసిన తరువాత మల్లి భయపడలేదు. సంతోషించింది. ఈ వార్త తనకే ఇంత ఆనందం కలిగిస్తే ఇక అతనికెంత సంబరం కలిగిస్తుందోనని పొంగిపోయింది. అందుకే రాత్రి..రాగానే మొట్టమొదట అతనికి ఈ వార్తే చెప్పింది.

అంతా విని నివ్వెరబోయాడతను. తన సంతోషంలో తానున్న మల్లి అతని మొహంలో కదలాడుతున్న భావాల్ని గమనించలేకపోయింది.

అందుకే..''ఇంతకీ మన బిడ్డకి పేరేం పెడదాం?'' అడిగింది.

పగలబడినవ్వాడతను, ఆ ప్రశ్న విని.

''మన బిడ్డా? అసలు మన అంటున్నావ్. నేనేమైనా నిన్ను కట్టుకుంటానని చెప్పానా? లేక నువ్వు నా పెళ్ళానివా?'' నవ్వుతూనే అడిగాడు.

అతని మాటల్లోని హేళన చాలా సూటిగా తాకిందామెని. ''అంటే?'' అయోమయంగా అడిగింది.

''నువ్వు పెళ్ళి కాని దానివి. నేనూ వయసులో ఉన్నాను. కనుకనే నీమీద మోజు పడ్డాను. తీర్చుకున్నాను. దానికి ప్రతిఫలంగా ఏరోజు కారోజు ఎంతో కొంత ముట్టజెప్పేశానుగా! ఇంకా ఏవిటీ తతంగాలు. ఈ వంకన నాకు పెళ్ళానివైపోయి నా ఆస్తంతా అనుభవించేద్దామనే? అలాంటి వేషాలు నా దగ్గరెయ్యకు మరి!'' వ్యంగ్యంగా అన్నాడు.

నెత్తిన పిడుగులు పడ్డట్టుగా అదిరిపోయింది మల్లి. ఆమె కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. ''నూడు సారూ! మా నాగులుగాడు మంచోడు కాడు. ఈ మాటలు ఆడి సెవినేసానంటే నిన్ను బతకనీయడు'' ఏడుస్తూనే హెచ్చరించింది.

మళ్ళీ విరగబడి నవ్వాడతను. ''ఓసి పిచ్చిదానా! ఈ వ్యవహారమంతా నడిపిందే వాడు. అసలు వాడి వ్యాపారం ఏమిటనుకున్నావ్? మీ గూడెం పిల్లలకి మాయ మాటలు చెప్పి, వాళ్ళని పట్నం తెచ్చి, మాలాంటి వాళ్ళకి తార్చి, డబ్బు దండుకోవడం...ఇదే! సరే..అయిందేదో అయిపోయింది. అసలే పెళ్ళికాని పిల్లవి. కడుపుతో ఉన్నావని తెలిస్తే చుట్టూ ఉన్న వాళ్ళంతా నిన్ను కాకుల్లా పొడుస్తారు. కనుక గుట్టుచప్పుడు కాకుండా కడుపు తీయించేసుకో!'' చెప్పేసి జేబులోంచి ఓ నోట్ల కట్ట తీసి ఆమె మీదికి విసిరేసి వెళ్ళిపోయాడు.

అవాక్కయిపోయింది మల్లి. 'గండం' అంటే జంతువులు తిరిగే అడవిలో మాత్రమే ఉంటుందనుకుంది, కానీ మనుషులు తిరిగే జనారణ్యంలో కూడా ఎదురవ్వచ్చని ఆమె ఊహించలేదు. తీరా అనుకోనిది జరిగే సరికి నిశ్చేష్టురాలయిపోయింది.

అప్పుడు అర్థమైందామెకి. అడవిలో పులిలాంటి పులులు, తోడేళ్ళలాంటి తోడేళ్ళు మాత్రమే ఉంటాయి. కానీ జనారణ్యంలో అలా కాదు. మనిషి తోళ్ళు కప్పుకున్న మృగాలు తిరుగుతుంటాయి. అవి నాగులులాంటి, మాయమాటలు చెప్పి మోసం చేసే తోడేళ్ళు కావచ్చు, తన ఆకలి కోసం అమాయికుల్ని బలిచేసే కాంట్రాక్టర్ లాంటి మనిషి వన్నెపులి అవనూ వచ్చు. అసలా మాటకొస్తే మృగాల మధ్యన ఎదురయ్యే ప్రమాదాలకంటే, మనుషుల మధ్యన ఎదురయ్యే ప్రమాదాలే చాలా భయంకరమైనవి.

అసలు పులికంటే, పుట్రకంటే మనిషిలోని కామమే కాలకూట విషం కంటే ప్రమాదకరమైంది. ఇంతకు మించిన పెద్దగండం ఆడదానికి ఇంకేం ఉంటుంది? ఇటువంటి గండాల్ని ఎదుర్కొంటూ, స్వార్థంకోసం సాటి మనిషిని చిత్రవధ చేసే మానవ మృగాల మధ్యన ఉండేకంటే, ఆకలైతే తప్ప వేటకురాని ఆ జంతువుల మధ్యనుండడమే మేలు..అనిపించింది.

మరుక్షణమే ఆ చోటును విడిచి ముందుకి కదిలిందామె. పుట్టబోయే బిడ్డతో కలిసి, హాయిగా బతకచ్చనే ధైర్యంతో అడవివైపు అడుగులేయడం ప్రారంభించింది.

## మామూలే!

కొన్ని అవకాశాలు మనల్ని వెదుక్కుంటూ వస్తాయి, మరికొన్ని అవకాశాల కోసం మనం ఎదురుచూడాలి. ఇపుడు అందాలతార శ్రీయని వెదుక్కుంటూ అవకాశం వచ్చింది. ఇది శ్రీయకి సంతోషానిస్తే రక్షితని షాక్‌కి గురిచేసింది. ఇండస్ట్రీలోకొచ్చిన కొత్తలోనే మెగాహీరోల సరసన నటించిన శ్రీయ ఇప్పుడు అర్జున్‌లో మహేష్‌తో నటించింది. ఇప్పుడు మళ్ళీ సదా మీ సేవలో కొత్త చిత్రంలో నటిస్తోంది. నిజానికి రక్షిత ఈ సినిమాకి హీరోయిన్ కాగా కొన్ని పరిణామాల అనంతరం ఈ చిత్రంలో నటించే ఛాన్స్ కొట్టేసింది శ్రీయ. భలేగా ఉంది కదూ!

